# ది గ్రేట్

నాలుగేళ్ళ క్రితం—

ఆ ఊరి కాలేజీలో లోకనాథానికి మంచి సరదాగా ఉండేవాడని పేరు. అస్తమానూ గోలచేస్తూ తిరిగేవాడు. అతనిమీద చాలామందికి సదభిప్రాయం లేనట్టే బహు కొద్ది మంది ప్రాణం పెట్టేసేవారు. ప్రాణం పెట్టే మనుష్యుల్లో చిరంజీవి మొదటివాడు.

లోకనాథానికి యెల్లప్పుడూ కుడీ, ఎడమా చెరోవేపు అయిదుగురు చొప్పున మనుషులుంటేనేగాని తోచదు. అతననేక విషయాలమీద ధారాళంగా మాట్లాడేయగల ఘనుడు. అతనేది మాట్లాడినా విని 'ఔను, యస్సనే' తన ఆత్మీయుల్ని అతను సర్వసాధారణంగా మెచ్చుకుంటూనే వుండేవాడు.

అత నెక్కువగా చదివేవాడు కాదు. చదువుమీద శ్రద్ధకం, యితర విషయాల్లో ఆసక్తీయీ రెండూ జాస్తీగానే వుండేవి. ఆ వూళ్ళో విడుదలయ్యే ప్రతీ సినిమా అతన్ని

తప్పించుకు పోయేదికాదు. ఈ సినీమా పిచ్చివల్ల అతను విపరీతంగా పాఠాలకి ఎగనామం పెట్టేవాడు. ఎక్కువ పిరియడ్లే అతనికి హాజరుపడేది. అయితే, హాజరుపడిన ప్రతి పిరియడికీ హాజరయ్యేవాడు గాదు. అతని ఆత్మీయుల్లో యెక్కువ భాగం అతని ఏజంట్లు (ప్రాక్సీలు), ఏ లెక్చరరుకైనా లోకనాథాన్ని కళ్ళచూస్తేనే తప్ప అతను హాజరైనదీ, లేనిదీ తెలిసేదికాదు.

టూకీగా లోకనాథంయొక్క గుణగణాలూ, లీలావిలాసాలూ యివి. లోకనాథాన్ని అంటిపెట్టుకు తిరిగే చిరంజీవి నెమ్మదస్థుడని లోకనాథం అభిప్రాయం. పాడు కంపెనీలో చేరి తన మంచితనాన్ని ఖర్చు చేసుకుంటున్నాడని ఎక్కువ మంది అనుకునేవారు. లోకనాథం స్నేహం మానుకోమని వాళ్లు చిరంజీవిని హెచ్చరించినప్పుడు నవ్వేసి,

"మీతోపాటు నాకు లోకనాథమూ కావాలి!" అనేవాడు.

ఈ మాటకి మంచి విద్యార్థులు హర్షించనప్పుడు చిరంజీవి నొచ్చుకోనూ లేదు!

చిరంజీవి అద్దెకుండే గదిముందు ప్లీడరుగా రిల్లుండేది. ఆయనకు పుట్టెడు చెవుడు. కొన్ని పరికరాల సాయంతో ఆయన యెదటివాడి బాధని అర్థం చేసుకునే వారు. ఆ ప్లీడరు గారింటికి పావలా ఛార్జీఅని రిక్షా వాళ్ళంతా ఓ ఎగ్రిమెంటు కొచ్చేసినట్టు ఖచ్చితంగా బేరం చెప్పేవారు. సాయంత్రం అయిదున్నర, ఆరు ప్రాంతాల ఆయనకేమీ తోచదు.

అప్పుడాయన తెల్లటి దుస్తుల్లో, వేళ్ళ మధ్య వెలుగుతున్న సిగరెట్టుతో స్టేషనువేపు వెళ్ళేవారు. ఆయనటు వెళ్ళిం తర్వాతగాని ఆ యింట్లో ప్రాణికోటికి ఆటవిడుపు దొరికేది కాదు. ఆ సమయంలో ఆ యింటి గుమ్మంముందు తళుక్కున మెరుస్తుండేది ఒక అందమైన చుక్క.

ఆ చుక్కమ్మపేరు భానుమతి!

భానుమతి చిరంజీవి వాళ్ళ కాలేజీలోనే చదువుకునేది. కాలేజీకి వెళ్ళేప్పుడు గానీ, తలెత్తి పరిసరాలు చూచేదికాదు. అర్జంటు పనున్నట్టు గబగబా అడుగులేయడం భానుమతికి అలవాటు.

చిరంజీవికి ఆడపిల్లలంటే వల్లమాలిన భయంలాంటి గుణం. వాళ్ళేదైనా మాట్లాడటం వింటే సిగ్గు. అందమైన ఆడపిల్లలకి రొంప పడితే బాధ. అప్పుడు ముక్కు చీదుతుంటే అసహ్యం. భూమ్మీద మనోహరమైన సృష్టి ఆడజాతని అతని ఉద్దేశం. మనోహరమైన యీ సృష్టి సర్వదా మనోహరంగా వుండాలనేది అతని సిద్ధాంతం. ఈ సిద్ధాంతానికి మచ్చుతునకగా భాసిల్లే ఎదురింటి భానుమతి!

ఈ భానుమతిని కాలేజీలోనే తీరుబడిగా చూచేందుకు వీలు చిక్కేదికాదు. ఇంటిదగ్గిర, అద్దెగది కిటికీ వారగా కుర్చీలో కూర్చున్నప్పుడు సాయంత్రం ఆరుప్రాంతాల భాను మతి కనిపించేది. అప్పుడతని మనసు గాల్లో తేలి, భానుమతిని చేరి పారవశ్యం చెందేది.

అందుచేత, అతను సాధారణంగా సాయంసమయాలు వృథాచేసేవాడు కాదు. ఒక్కోసారి వర్షం లాంటిదొచ్చి తన ప్రయత్నాన్ని తినేసినప్పుడు అతనెంతో కృంగిపోయేవాడు. మరో సందర్భంలో చెవిటి ప్లీడరు స్టేషనువేపు వెళ్ళడం మానుకున్నప్పుడు, కాల రుచ్చుకుని రెండు వాయించేద్దా మనిపించేది. అయితే అతడి మనసులోని ఈ మాటలెప్పుడూ అతనెవర్తోనూ చెప్పేవాడు గాదు.

ఏదో సందర్భంలో లోకనాథం దగ్గర నోరు జారిన క్షణంలో లోకనాథం యెంతో ఆశ్చర్యపోవడం గమనించి తల దించేసుకున్నాడు. లోకనాథం అప్పుడతని భుజాన్ని చరిచేడు. అతి విశ్వాస పాత్రమైన గుర్రాన్ని రౌతు బుజ్జగించినట్లు బుజ్జగించేడు. తలెత్తి తనవేపు తిన్నగా చూడమని ఆదేశించేడు. చిరంజీవి బెరుగ్గా అతనివేపు చూసేడు. లోకనాథం కుడి కన్నొక్కటే మూసి మళ్ళా తెరిచి నవ్వేస్తూ అన్నాడు.

"గాడ్! చిరంజీవి సామాన్యుడు కాదు."

నిజానికి చిరంజీవి సామాన్యుడేం కాదు అతను బుద్ధిగా చదువుకునే క్లాస్ వన్ బుద్ధిమంతుడు. విద్యార్థుల్లోనూ, అధ్యాపకుల్లోనూ అతనికి విలువ వుండేది. ఎకనామిక్స్‌లో బ్రిలియంటని గొప్ప పేరూ వుండేది.

ఓరోజు ముసురుపట్టినా సాయంత్రం అద్దెగదిలో చిరంజీవి మనసు దిగులు చెందినవేళ భానుమతి అతని గుమ్మం దగ్గర ప్రత్యక్షమైంది. అతనప్పుడు కలవరపాటు చెందాడు. ఏం

చేయాలో నిర్ణయించుకునే ముందే భానుమతి చాలా ఖరాదుగా అడిగేసింది.

“మీకేం అడ్డంకాపోతే మీ ఎకనామిక్సు నోట్సు వో తడవ యివ్వండి. మళ్ళా రెండురోజుల్లో యిచ్చేస్తాను.”

చిరంజీవి కేవలం నోట్సు ఒక్కటే యిచ్చింతర్వాత చాలా బాధపడిపోయేడు. ఈ విధంగా నోట్సు యివ్వవలసి వస్తుందని ముందే తెలుస్తే యెంచక్కా ‘ప్రేమలేఖ’ కూడా పొందుపరిచే యేర్పాటు చేసేవాడినిగదా అని బాధపడిపోయేడు. ఈ ఉదంతం యావత్తూ లోకనాథానితో చెప్పి అతని ఉద్దేశాన్ని అడిగినప్పుడు మాత్రం తను చేసిన పనే సబబని తోచింది. లోకనాథం సృష్టి ధర్మాన్ని వివరించేడు.

“నువ్వు ప్రేమించిన మనిషి ఆడది. ఆడది తలుచుకుంటే మగవాడి జాతకం బజారుపాలై పోవడం యేమంత దుస్సాధ్యమైన కార్యం కాదు. అందునా భానుమతి ప్లీడరు గారమ్మాయి. ప్రేమలేఖ ఆడనుంచి మగకి వొస్తేనే సుఖం. అంతేగాని యిట్నుంచి అటు వెళ్ళగూడదు చిరంజీవి! హేస్టీ స్టెప్పు తీసుకోవద్దు.”

ఆర్నెల్లు గడిచింతర్వాత అట్నుంచి యిటు ప్రేమలేఖ రాకపోయినా, అటుకీ యిటుకీ సన్నిహితత్వం యెక్కువయ్యింది.

ఓ రోజు లోకనాథం చిరంజీవి అద్దెగదికి వొచ్చేడు. భానుమతి విహారాలు చూసేడు. అకస్మాత్తుగా గదిలోంచి

బయటకొచ్చి స్టేషను రోడ్డువేపు నడక సాగించేడు. మరో అరగంటకి చెవిటి ప్లీడరుతో పాటు లోకనాథం భానుమతి వాళ్ళింట్లోకి వెళ్ళడం చూచిన చిరంజీవికి యేమీ అర్థమైంది కాదు.

అప్పారావుగారి పార్టీ పెద్దది. అందులో వారి హోదా యింకా పెద్దది. దేశంలో వారి పేరు మహా గిరాకీగా వుండేది. వారు సంఘసేవకులు; నిస్వార్థజీవులు. త్యాగధనులు, అపారమైన హృదయ వైశాల్యం కలవారు, ఈ దేశ స్వాతంత్ర్యంకోసం వారనేకసార్లు జైళ్ళకెళ్ళొచ్చేరు. దొరల కళ్ళల్లో పడి, హింసలను పూలదండలుగా స్వీకరించి భరించేరు. వారు దేశానికి ముద్దుబిడ్డలు.

ఆ సాయంత్రం వారి గంభీరోపన్యాసం ఆ వూళ్ళో యేర్పాటుచేయడం మూలంగా టి. బి. లో విడిది చేసేరు. వారితో పిచ్చాపాటీ మాటాడేందుకొచ్చిన వూరి పెద్ద మనుష్యుల్లో చెవిటిప్లీడరు ఉన్నారు. అప్పారావుగారు చెవిటాయనకి దూరబ్బంధువులని పెద్దమనుషులవరకే తెలుసును. చెవిటాయన పెద్దన్నకొడుకు. డిగ్రీపుచ్చుకున్న వాడికేదైనా దిక్కుమాలి వుద్యోగం వేయించమని అప్పారావుగారిని అడిగేరు. అప్పారావుగారంతావిని సోఫాలో కొంచెం సర్దుకూర్చున్నట్టు కూర్చుని అన్నారు:

“చూద్దాం. తప్పకుండా చూద్దాం. మీరెళ్ళిరండి. నేను కబురంపుతానుగానీ, మీ అడ్రస్సు సెక్రటరీకివ్వండి. మంచిది. వెళ్ళిరండి.”

చెవిటాయన బయటకొస్తుండగా లోకనాథం ఎదురు పడ్డాడు. ఇద్దరూ కళ్ళతోనే యేదో మాట్లాడుకున్న తర్వాత చెవిటాయన బయటకి వెళ్ళేరు. లోకనాథం లోపలికొచ్చాడు. లోకనాథాన్ని అప్పారావుగారు చూస్తూనే రుద్రులయ్యారు. కోపంగానే అన్నారుగానీ, శీవితో ఆ కోపం కొంచెం లోపించి నట్లయింది.

"ఊ... అవున్రా ఒరేయ్! ఎలాగైనా పెద్దవాడివి. నేను నీ కిప్పటిగ్గాని జ్ఞాపకం రాలేదన్నమాట. నేనొచ్చి ఎంత సేపయిందినా? ఏట్రా నువ్వేలిగించే రాజకీయాలు? ఇంతా లిస్యమా?"

"........."

"బాగా చదివేడుస్తున్నావా? లేక, దాన్ని నట్టేటిలో ముంచేస్తున్నావా? ఈ ఏడాదైనా మిటకరిస్తావా."

"బాగానే చదువుతున్నాను మావయ్యా."

"ఒరేయ్ లోకం! దేనికైనా తెలివితేటలుండాల్రా. తెలివి! నేనో సలహా చెప్పనా?"

"చెప్పు మావయ్యా."

"మరేంలేదు! నీకూ, ఈ చదువుకీ పడకపోతే, వింటున్నావా? ముద్దు మొహమావినీ. నువ్వీ జన్మలో ప్యాసవ్వ లేవని నమ్మకముంటే, ఏమిటి — చక్కగా కాపీకొట్టేయ్. కాపీకొట్టి పాసవ్వు, అంతే. తర్వాత నిన్నందల మెక్కించే బాధ్యతలనాది. ఏమిటి విన్నావా."

"విన్నాను మావయ్యా!" అన్నాడు వినయంగా.

వినయ విధేయతలు ప్రదర్శిస్తోన్న మేనల్లుణ్ణి చూచుకొని అప్పారావుగారు మురిసిపోయిన చిహ్నంగా తను రొయ్యమీసాల్ని ఉంగరాలున్న వేళ్ళతో దర్జాగా దువ్వుకున్నారు.

ఆనక, ఆ మామా అల్లుళ్ళ మధ్య కుటుంబ విషయాలెన్నో కదిలేయి.

"అప్పారావుగారున్న ఆ రెండురోజులూ లోకనాథానికి క్షణం తీరుబడి చిక్కలేదు. మూడోనాడు సాయంత్రి, నాలుగురోజులక్రితం ఫ్రండు గౌరీపతి ప్రెజంట్ చేసిన 'సీసా' సీలు విప్పేడు.

సీసాలో మందు కొంచెం కొంచెంగా సోడాతో కలుపుకుని గొంతులోపోసుకొని, ఆ పైన ఇన్ని జీడిపప్పులు (కారంలో కలిపినవి) నమిలి సిగరెట్టు ముట్టించి హాలోలాలుపైన వెల్లకిలా పడుకున్నాడు. సరిగ్గా అదేసమయానికి చిరంజీవి అతని గుమ్మంముందు నించున్నాడు.

చిరంజీవి చూచింతర్వాత లేచికూచుందా మనుకున్న లోకనాథం మరిలేచేందుకు ఓపికలేక అలాగేపడుకుని మత్తుగా అన్నాడు.

"నాక్రబదర్! బండికొంచెం వొడిదుడుకుల్లో వుంది. గుర్రం వేగంగా పనిచేస్తోంది. వొచ్చి అలాకూర్చో!"

చిరంజీవి ఆశ్చర్యపోలేదు, — గుమ్మంవిడాదే కూర్చున్నాడు.

"రెండు రోజుల్నుంచీ నన్ను మావయ్య తినేశాడు. ఇప్పుడే నువ్వొచ్చేటందే నోరుతెరుచుకున్నాను. శాస్త్రీ వ్యవహారమేమో తో కగా తన్నేసింది. ఐయామాఫ్! ఫర్లేదు. వెళ్ళిపోకు కూర్చో! ఏమిటీ విషయం? బొత్తిగా కన్పించడమే మానేశావ్? భానుమతేమంటుంది."

"నేనూ, ఆ ప్లీడరూ పోట్లాడుకున్నాం."

"సేసో! అవుతే జరిగిందన్నమాట ప్రళయం. ప్రేమలో ప్రళయం. వెరీగుడ్. ఈ దెబ్బ ఎలాగుంది నీకు."

"నేను గదిమారేను. అంగరవారి వీధిలోకి వెళ్ళిపోయేను."

"అంగరవారి వీధా? డజన్ట్ మేటర్ మచ్! మహా అయితే మైలుదూరం. నందికాదనుకుంటే పదిపైసలుపారేస్తే అద్దెసైకిలు."

"ఇవాళ నీతో మాటాడదామని వొచ్చేను నువ్వీ స్థితిలో వున్నట్టు తెలిస్తే మరోనాటికి వాయిదా వేసేవాడిని. వొస్తా పదుర్కో."

"గుడ్ డే బ్రదర్! బై ...తలుపేసి వెళ్ళిపో...బై ... ఛిరియో... ప్రేమకోసమై వనవోన నెనేనాపంనవినాను."

♦ ♦ ♦

నాలుగేళ్ళ తర్వాత—

ఓ రాత్రి ఖరీదైన క్లబ్బులో - ట్యూబ్ లైట్ల క్రింద లోకనాథం కూర్చున్నాడు. అతని చేతిలోని పేకముక్కలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

"ఆల్ కౌంట్. వెరీబేడ్ డే ఫర్ మీ!"

సిగరెట్టు యాష్ట్రేలో కుక్కి ఒళ్ళు విరుచుకున్నాడు లోకనాథం.

"గంగులూ, తొందరగా టీ పట్రా!" అని కూడా అన్నాడు.

గుమ్మం దగ్గిర నిద్రకి తూగుతూన్న గంగులు 'సంపుకు తింటన్నాడ్రా మొగుడు' అని విసుక్కున్నాడు.

లోకనాథం పక్కగా కూర్చున్న కొత్తసభ్యుడు బెరుగ్గా అడిగేడు.

"కెనై గో నౌ బాస్."

కొత్త సభ్యుడికి మొన్నీ మధ్యనే పెళ్ళవడం మూలంగా, శీతాకాలపు రాత్రు లెంత విలువైనవో గ్రహించగలిగేడు. ఈ విషయం టేబిల్ ముందు కూర్చున్న ఆసాములందరూ పసిగట్టేరుకూడాను. కానీ, కొత్త సభ్యుడు వెళ్ళిపోతానన్న మాటట లోకనాథం మండిపోయేడు. నొచ్చుకున్నట్లు నటించి యాంగ్రీగా అనేసినట్లు మాట్లాడేడు.

"నో... ఇంతెర్లీగా వెళ్ళిపోవడం బాగుండదు. గంట పదేగదూ అవుత. పౌన్లోనే భోజనం ముగించి వెళ్ళిపోదాం. బసవరాజింట్లో చేతులు కడుక్కోవాలని ఉందివాళ. మరి ప్రోగ్రాం మార్చేయకండి... కమాన్ మిస్టర్ రావ్! చాలా ఆలస్యంగా ముక్కలేస్తూన్నారు మీరు. రెండు రౌండ్లు ఆడిపోతాం. వేగం పెంచండి. ఇలాగైతే తెల్లారిపోతుందలవతల. క్విక్."

పంచుతూన్న ముక్కల్ని ఆపి, లోకనాథం కళ్ళల్లోకి తీక్షణంగా చూచినమీదట సానునయంగా అన్నాడు రావు.

"వండరేమిటంటే, ఇవాళ లోకనాథంగారు పూర్తిగా పేకాట పత్తైపోయారు. ఎనిమిదింటికే కార్లో కూర్చునే లోకనాథంగారివాళ పదైనా కదలడంలేదు. ఇవాళ మీ మనసేం బాగోలేదా? పోనిండి - మీ దగ్గిర గెల్చుకున్న డబ్బు అణా పైసల్తో ముట్టచెప్పేస్తాంగాని నన్నుతొందర పెట్టకుండా వెళ్ళిపోండి బాబూ! నేను రోజూ లాగానే ముక్కలు పంచుతానంతే! నూరు ఆరైనా; ఆరు నూరైనా నా పద్ధతి ఛస్తే మార్చుకోనంతే!"

లోకనాథానికి క్షణంలో కళ్ళెర్రపడ్డాయి. సీట్లోం వేగంగా లేచినించోడంతో టేబిల్ చుట్టూతా ఉన్న జనం ఖంగారుపడిపోయేరు. రావుగూడ అంతవిసురుగా లేవడంతో పెద్ద ప్రళయమేదో జరిగి తీరుతుందని అనుకున్నారు. కాని, అదేం జరగలేదు. ఎంతయినా, అక్కడ చేరిన జనం కల్చరున్న పెద్దవాళ్ళాయె!

"థాంక్స్ టూ మచ్ మిస్టర్ రావ్! గుడ్ నైట్ జెంటిల్మెన్! గుడ్ నైట్."

రావ్ మాటల్ని వినకుండానే లోకనాథం కారు దగ్గిరికి నడుగెత్తాడు. వెనకాతల కొత్తసభ్యుడొస్తున్న వైనం గమనించకుండానే కారు స్టార్టుచేసి, వేగం పెంచేడు అక్కడ కదిలినకారు మరో పది నిమిషాల్లో పదిమైళ్ళ దూరంలోవున్న అఫీషియల్ కాలనీలో ఆగింది.

కారుదిగి అందమైన భవంతిలోకి అడుగుపెట్టేడు లోకనాథం. తనెదురుగావున్న సోఫాలో ముచ్చటగా కూచుని పుస్తకం చదువుకుంటోంది భానుమతి. లోకనాథం బూటు లేసు విప్పుకుంటో ఆ పుస్తకాన్ని పరీక్షగా చూసేడు.

'డర్టీ క్రీచర్' అని మనసులో అనుకున్నాడు.

పుస్తకాన్ని సోఫాలో ఓ మూల వొదిలేసి భానుమతి లేచినించుని వయ్యారంగా వొళ్ళు విరుచుకుంది.

"నా కర్థంకాదు భానూ! వాడంత గొప్పగా రాసేయగల దిట్టా? ఏమిటి రాస్తాడేమిటి? చెత్త ప్రేమకథలేగా? ఇంకా ఏమైనా రాస్తాడా."

భానుమతి జవాబివ్వలేదు.

"ఈ సోకాల్డ్ చిరంజీవి నాలుగేళ్ళక్రితం నా నీడలో బతికేవాడు ఫూల్!"

"ఇప్పుడు పదిమంది దృష్టిలో పడ్డాడు. అదే తేడా" అన్నది భానుమతి.

"నన్నడుగుతే వాణ్ణి మెచ్చుకునే ప్రతినన్నాసీ పెద్ద ఫూల్! ఈ వెధవకి రేపు టౌనుహాల్లో పెద్దఎత్తున సన్మానం.

హా చీ పిటీజ్! నాలుగు ముక్కలు రాసుకునే ప్రతి ముష్టి వెధవలకీ సన్మానాలు! సన్మానాలు! ఏం పొడుస్తున్నారు వీళ్ళంతా."

భానుమతి గబగబా నవ్వేసి అడిగింది.

"నాకు తెలీకడుగుతాను. రేపా సభలో మీరిలాగే మాటాడేస్తా రేమిటి ఖర్మ? సభాధ్యక్షులు సభా మర్యాదని పాటించితీరాలి సుమండీ."

ఈ హెచ్చరికతో మరింత మండిపడి పోయేడు లోకనాథం.

"నా మెడకి ఉరి వేసి తమాషా చూస్తున్నారు. ఈ బసవరా జొకడు నా పాలిట యముడై పోయే డవతల వాడు నాకు మంచి ఫ్రండవడం మూలంగా ఈ తతంగం యావత్తూ నా కొదిలిపెట్టేట్ట స్కౌండ్రల్. షూట్ చేసి పారేద్దును. పెద్ద ముండావాడు చచ్చిపోగలడని వూరుకున్నాడు. అంత పెద్ద మనిషి ముందు 'నో' అంటే గీర అనుకుంటాడని మోడెస్టీ కోసం యస్సన్నాను. వాడికి సన్మానం, నాకు శ్మశానం. డేమ్ హెల్. పెద్దవాళ్ళకి బుద్ధులుండ వసలు."

తాయారమ్మ నీళ్ళు తోడినట్లు వినయంగా చెప్పింది. అయినా అతనా రాత్రి స్నానం చేయలేదు పైగా భోజనమూ చేయలేదు.

ఉదయం ఆఫీసుకి ఫోన్ వచ్చింది. హోటల్ వూటీలో ఇరవై రెండో గదిలో చిరంజీవికి విడిది ఏర్పాటు చేశార్ట. వెళ్ళి కలుసుకుని యేర్పాట్లు చూడవలసిందిగా కంపెనీ డైరక్టరు బసవరాజు లోకనాథాన్ని ఫోన్లో కోరేడు.

హోటల్ ముందు కారుదిగిన లోకనాథం మనసులో యేదుస్తూనే ఇరవై రెండో గది దగ్గరికి చేరేడు. అప్పుడే గది లోంచి నలుగురు మనుషులు బయటకు రావటం చూచి తన 'ఆఫీసరు' హోదా మట్టికలిసినంతగా బెంగపడిపోయేడు. గది లోకి అడుగుపెట్టి చూసేను.

తళతళా మెరిసిపోతున్నాడు చిరంజీవి. తెల్లగా బొద్దుగా, అందంగా కనిపించే డతను. ఖరీదు పెరిగిపోయిన మనిషి లాగానూ కనిపించేడు. 'అసాధ్యుడు' అనుకున్నాడు లోక నాథం. 'వెధవ బాగుపడిపోయేడు' అనికూడా అను కున్నాడు.

లోకనాథాన్ని చూస్తూనే లేచి నించున్నాడు చిరం జీవి. లోకనాథం తన చేతిని ముందుకి చాచేడు. ఆ చేతిని మృదువుగా తాకేడు చిరంజీవి.

"క్షేమమా?" అడిగేడు చిరంజీవి.

"ఆహా!" అన్నాడు లోకనాథం.

ఇద్దరూ కూర్చున్నారు. చిరంజీవి దగ్గిరున్న సిగరెట్లు ముట్టించుకున్నారు. పొగ వొదులుతూ అన్నాడు చిరంజీవి!

"నాలుగేళ్ళయింది కదా!"

"అవును."

"భానుమతి క్షేమమా?"

"క్షేమమే!"

రెండు నిమిషాలు మౌనంగా గడిచినా, లోకనాథం చిరంజీవి కోసం ఏర్పాట్లని వాకబు చేయలేదు. మళ్ళా చిరంజీవే మాట్లాడేడు.

"పిల్లలా?"

"లేరు."

"నాకు పిల్లలంటే మహా సరదా!"

వాళ్ళతో స్నేహం బలే తమాషాగా వుంటుందిలే. ఒక చిన్న జోక్ చెప్పేదా!"

"భోర్! నస పెట్టకుండ కాసేపేదైనా మాట్లాడు. అన్నట్టు నీ కెంతమంది పిల్లలు?"

"లేరు."

"వెరీగుడ్! మనిద్దరం ఒకే పడవనెక్కాం."

"కాదు"

"అదేమిటి?"

"రెండు పడవలు, నీ పడవలో భానుమతి వుంది. నా పడవలో నేనొక్కణ్ణే వున్నాను."

"పెళ్ళి కాలేదా?"

"ఇంతలో కాదు. నాకు, పిల్లల్ని కనిపెట్టగల అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనివుంది. అందుచేత ఆ వేటలోవున్నానింకా."

"నీ కిక్కడ చేసిన ఏర్పాట్లు బాగున్నాయా?"

"విశేషంగా వున్నాయి."

"నాతో ఇంకా ఏమైనా మాట్లాడతావా?" లేచేందుకు సిద్ధపడి అడిగేడు లోకనాథం.

"నాకు నువ్వంటే విపరీతమైన గౌరవ ముండేది."

"ఇటీజాల్ రైట్ చిరంజీవీ! సాయంత్రం మళ్ళా సభలో కలుసుకుందాం." అన్నాడు లోకనాథం లేచి నుంచుని.

"ఓ కె!" అన్నాడు చిరంజీవి కూర్చునే.

లోకనాథం వెళ్ళిపోయిం తర్వాత చిరంజీవి తన డైరీలో ఇలా రాసుకున్నాడు:

"లోకనాథం వచ్చి వెళ్ళాడు. ఈ అవకాశం కోసం నేను చాలా కాలం ఎదురుచూశాను. అతనొచ్చీరావడంతోనే గొప్ప టార్చర్ యిచ్చిపారేశాను. తర్వాత జాలికలిగింది. నన్ను వంచించిన లోకనాథం పొట్టి అర్భకుడనే నిర్ణయాని కొచ్చేను. భానుమతినీ ఏడిపించాలని వుందిగానీ, ఆడకూతురు కన్నీరుపెడితే, నేను సుఖించలేనేమో ఏమో!"

ఆ సాయంత్రం సన్మానసభ మహా వైభవోపేతంగా జరిగింది. ఆ సభలో చిరంజీవి గురించి చాలా యింపుగా మాట్లాడేడు లోకనాథం.

"ఇతన్నాకు బాగా తెలుసు. చాలాకాలంవరకూ మేమిద్దరవ్వూ కలిసి చదువుకున్నాం. అప్పట్లోనే అనుకున్నాను ఇతనింత గొప్ప రచయితై పోగలడని కనుక ఇప్పుడిక్కడ మీా సమక్షంలో ఇంతెత్తు ఎదిగిన చిరంజీవిని చూచి నేనేం ఆశ్చర్యపడిపోను. అయితే నా మిత్రుడు, నా సహపాఠి

గుణవంతుడూ అయిన చిరంజీవిని మీా రందరూ చేరి ఘనంగా సన్మానించడం చూచి నేను గర్విస్తున్నాను."

అప్పు డక్కడ వేదికమీాదున్న చిరంజీవి మెల్లిగా నవ్వు తున్నాడు 'మేనమామనే మరపించిన ఓ లోకనాథమూ, నువ్వీ వూళ్లో ఆఫీసరువై ఏం చేస్తున్నావో గానీ, రాజకీయంలోనైతే మీా మేనమామనే తలతన్నేవాడివి గదరా!' అని లోలోన అనుకున్నాడు.

సభ పూర్తయిం తర్వాత లోకనాథాన్ని అడిగేడు చిరంజీవి—

"భానుమతిని తీసుకురాలేదేం?"

"రానన్నది."

"కోస్తున్నావ్!"

"నాన్సెన్స్."

"పోనీలే ఇప్పుడు నేనే మీా యింటికొస్తాను. తీసుకెడ తావా?"

"కుదరదు. నే నర్జంటుగా పొరుగూరు వెళ్ళాలి. మరో నాడెప్పుడయినా చూద్దాం."

చిరంజీవి వేదాంతిలా తలూపేడు.

రైలు కదిలేముందు చిరంజీవి ప్లాటుఫారంమీాదే నిలు చున్నాడు. అతని చుట్టూ అతని అభిమానులు నించున్నారు. వాళ్ళందర్తోనూ అతను చేతులూపుకుంటో, బిగ్గరగానవ్వుతూ మాట్లాడుతున్నాడు. మాటాడుతూన్న మనిషి కాస్తా ప్లాటు

పారం చివర్లో లోకనాథం కనిపించడంతో ఠక్కున మరి మాట్లాడటం ఆపేసేడు.

లోకనాథం చిరంజీవి దగ్గరకొచ్చి, చిరంజీవి చేతిలో ఓ కాగితం ముక్క ఉంచేడు.

"రైలు కదిలింతర్వాత తీరుబడిగా చదువ్కో, వస్తా. బై."

తను చెప్పదలుచుకున్నదంతా రెండు ముక్కల్లో తేల్చి పారేసి: ఎలా వొచ్చినవాడు అలానే వెళ్ళిపోయాడు లోకనాథం.

రైలు కదిలింతర్వాత సీట్లో కూర్చుని చీటీని విప్పేడు చిరంజీవి. దాన్లో ఇలా వుంది:

"నువ్వు మేడిపండువని ఇప్పుడే అర్థమయింది. నా విషయం నీకు తెలుసు. నేను కేవలం భానుమతికోసవే చదివేను. భానుమతి కోసవే మావయ్యని ఆశ్రయించి పెద్దవాడినయ్యేను. భానుమతిని పెళ్ళిచేసుకొని, ఒక హోదాని నా భార్యకు కొనిపెట్టాను. నే చేసినది, చేసేది _ అంతా భానుమతి సుఖంకోసవే. మే మిప్పుడు సుఖంగా ఉన్నాం. నువ్వు మాకు, ముఖ్యంగా భానుకి గుర్తు రాకూడదు. నిన్ను చచ్చిపొమ్మని నేను చెప్పను. నువ్వూ పెళ్ళిచేసుకో. నీ బ్రతుకు నువ్వు బ్రతుకు. మళ్ళా ఇటువేపు వొచ్చేందుకు ప్రయత్నించకు. ఒచ్చినా_ఈ సన్మాన వ్యాపారం సాగించకు. ఇది నా రిక్వెస్టని భ్రమిస్తే, నే నేం నొచ్చుకోను. మళ్ళీ మాక్కనిపించకొరేయ్!"

చిరంజీవి చీటీని ముక్కలుగా చేసి కిటికీ ద్వారా బయటకు విసిరేడు. సిగరెట్టు ముట్టించి 'ఇంత' పొగని బరువుగా వొదిలేడు.

ఈ భూమ్మీద నేకమంది పుట్టి పెరిగినట్టే భానుమతీ పుట్టి పెరుగుతోంది. కానీ, తోటి కోట్లాది జనాభాలో ఇద్దరు 'మనుషులు' కేవలం ఈ భానుమతి మూలకంగా ప్రయోజకులైన (కారణ మేదైనా కావచ్చు) వైనం విన్నప్పుడు నేనెంతో ఆశ్చర్యపోతుంటాను. నా కప్పుడు భానుమతి అతి సామాన్యమైన స్త్రీగా తోచదు.

—జ్యోతి దీపావళి మాసపత్రిక 1966 నుండి